# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- నీటి పారుదల ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

- మత్స్యకారులు ఆందోళన చెందుతున్న 217 జీఓపై రాబోయే మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు.

- ఎన్ టి ఆర్ భరోసా పేరిట సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఉదయం నుంచి ప్రారంభమైంది.

- భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి విశాఖపట్నంలో ఈనెల 3వ తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని మంత్రి పి.నారాయణ తెలియజేశారు.

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీటి పారుదల ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నంద్యాల జిల్లా సున్నిపెంటలో నిర్వహించిన 'మన నీరు-మన సంపద' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నీటి నుంచి సంపద సృష్టించవచ్చని... సంపద సృష్టితో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

అలాగే 'సామాజిక న్యాయం, దామాషా ప్రకారం ప్రతి వర్గానికి న్యాయం చేయడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని, షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, త్వరలో అర్హులైన వారిని గుర్తించి కొత్త పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలు అన్నింటిని విడతల వారీగా అందిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మత్స్యకారులు ఆందోళన చెందుతున్న 217 జీఓ రద్దుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం టెక్కలి ప్రాంతీయ ఆసుపత్రి సమీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఉదయం నుంచి ప్రారంభమైన ఎన్.టి.ఆర్. భరోసా పేరిట సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు ఇంటింటికీ వెళ్ళి నగదును అందచేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్ళి పింఛన్ ను అందించారు. అనంతరం ఫించన్ లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖీలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజల ఆదాయం పెంచే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వంతో జవాబుదారీ పరిపాలన అందిస్తామని తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లా రాయచోటిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని మంత్రి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్య రాణి పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలలో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 3వ తేదీన విశాఖపట్నంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నిబంధనల ప్రకారం భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటే, వీలైనంత త్వరగా వారికి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమాల వల్ల పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2014-19 సంవత్సరాల మధ్య టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్లను కేటాయిస్తామని మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తల్లిపాలు అమృతంతో సమానమని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను స్థానిక ఘోషా ఆసుపత్రిలో ఆయన ఆరోజు ప్రారంభించారు. తల్లిపాల శ్రేష్టతను వివరిస్తూ రూపొందించిన గోడ పత్రికలు, కరపత్రాలను ఈ సందర్భంగా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... తల్లి పాలు సహజ సమతుల్య ఆహారమని, తల్లిపాల ద్వారా శక్తితో పాటు ఎన్నో విలువైన పోషకాలు బిడ్డకు అందుతాయన్నారు. తల్లిపాల విశిష్టతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని కలెక్టర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ, తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానమని, బిడ్డకు పాలివ్వడంవల్ల తల్లికి గర్భస్థ వ్యాదులు, రొమ్ము కేన్సర్ వంటివి దరిరావన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలోని పెద్దగడ్డ ప్రాజెక్ట్ నీటిని మంత్రి ఖరీఫ్ పంటల సాగుకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జలాశయం 96 శాతం నీటితో నిండిందని, ఆయకట్టుదారులు పొదుపుగా వాడుకుంటే ఈ ఖరీఫ్ కు నీరు సమృద్ధిగా సరిపోతుందని అన్నారు. పెద్దగెడ్డ ప్రాజెక్టును త్వరలో పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని, అలాగే పాసు పుస్తకాలను ప్రభుత్వ రాజముద్రతో పంపిణీ చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రాలకు ఉప వర్గీకరణ అధికారం ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని అన్నారు. ఈ ప్రక్రియను వేగవంతానికి చొరవ తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఈ సందర్భంగా ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేసారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆకాశవాణి  విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో ఈ రోజు నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాలకు 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభం అవుతుందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి తెలిపారు. ఈ బులెటిన్ రాత్రి 8 గంటల 30 నిమిషాల నుండి 8 గంటల 40 నిమిషాల వరకూ ప్రతీ రోజూ ప్రసారమవుతుంద, అలాగే సాయంత్రం 6 గంటల 10 నిముషాల నుండి 6 గంటల 20 నిముషాల వరకు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలు యధా ప్రకారం కొనసాగుతాయని వివరించారు. కాగా, ఆకాశవాణి శ్రోతలు కొత్త న్యూస్ బులెటిన్ ని కూడా ఆదరించాలని శ్రీసాయి వెంపాటి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 5, 6వ తేదీల్లో కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా వెల్లండించారు. దీనికి సంబందించి ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్లపై ఆయన సమీక్షి నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ... రెండు రోజుల పాటు నిర్వహించే కలక్టర్ల సమావేశంలో మొదటి రోజు కలెక్టర్లతోను, రెండవ రోజు కలక్టర్లు, ఎస్పిలతో కలిసి సంయుక్త సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభ ప్రజాపద్దుల కమిటీ 15 మంది సభ్యులతో ఈరోజు ఎన్నిక అయింది. ఈ 18వ  లోక్‌సభ ప్రజాపద్దుల కమిటీలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లోక్ సభ సభ్యులు సీఎం రమేష్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వి.బాలశౌరికి  అవకాశం లభించింది. కమిటీలో సభ్యత్వం కోసం 19 మంది ఎంపీలు పోటీపడగా... చివరి నిమిషంలో నలుగురు సభ్యులు ఉపసంహరించుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 2025 ఏప్రిల్ 30తో సభ్యుల కాలపరిమితి ముగియనుంది. ఆ తర్వాత మరోసారి ఎన్నిక జరగనుంది. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని బ్రేక్ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం కోర్టు సమీపంలో రహదారి భద్రతపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రయాణికులు ఆటోలో కుడి వైపు కూర్చోకుండా మధ్యలోనే కూర్చోవాలని

సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. అలాగే ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఢిల్లీలో ఈరోజు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ పథకం కింద విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం 100 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. భక్తుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాల ప్రతిపాదనల వివరాలు వినతి పత్రంలో వివరించారు. ఇప్పటికే దేవాదాయ శాఖ, శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణ అధికారి పత్రిపాదనలు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =